క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



పెద్దమ్మ సన్నిధిలో గంగుల ఇందిరమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మను మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి సతీమణి గంగుల ఇందిరమ్మ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనివార్య కారణాల వల్ల దేవరకు రాక పోవడంతో ఆమె మంగళవారం వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈమెకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జాకీర్‌బాషా, ప్రతాప్‌రెడ్డి, డీలర్ పెద్దన్న తదితరులు ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయ హుండీలోని కానుకల లెక్కింపు మంగళవారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచి నేటి వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. మొత్తం 54 రోజులకు గాను రూ. 3.63 లక్షల ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఈఓ నరసయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మహేష్, భాస్కరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్చాలి



సర్వాయిపల్లె అంగన్‌వాడీలో కార్యకర్తతో మాట్లాడుతున్న ఎంఈఓ 1 రఘురామిరెడ్డి

ఉయ్యాలవాడ : బడిఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని ఎంఈఓ 1 రఘురామిరెడ్డి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని సర్వాయిపల్లె, పెద్దయమ్మనూరు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. గ్రామాల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి ఇంటింటా తిరిగి 5 సంవత్సరాలు పూర్తైన పిల్లలందరినీ బడిలో చేర్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీలు, పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.


27 నుంచి ఎస్ఎఫ్ఐ మహాసభలు



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు కేరళలో ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరిగే మహాసభకు వెయ్యిమందికి పైగా ప్రతినిధులు హాజరవుతారన్నారు. గత మూడు సంవత్సరాల పోరాటాలు, నిర్మాణంపై సుదీర్ఘ చర్చలు జరపడం జరుగుతుందన్నారు. 1970లో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ ఇప్పటి వరకు విద్యార్థుల పక్షాన ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సందీప్, చిన్నహుసేన్, సాయి, సంజయ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కౌలుకార్డులు



మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్ర

దొర్నిపాడు: దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కౌలుకార్డులు మంజూరు చేయాలని తహసీల్దార్ సుభద్ర గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కౌలు రైతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే తప్పని సరిగా కౌలుకార్డు అవసరం అన్నారు. ఎలాంటి ఆలస్యం లేకుండా విచారణ చేసి ఇవ్వాలన్నారు. అలాగే నీటి తీరువా పన్ను వసూలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.





డి.కొట్టాల మెట్ట వద్ద గతేడాది శిలా ఫలకం ప్రారంభిస్తున్న గంగుల (ఫైల్) , గుర్తు తెలియని దుండగులు శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

ఆగని ఆగడాలు

- నాటి ప్రభుత్వ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక శిలాఫలకాలపై అక్కసు
- తాజాగా డి. కొట్టాలలో శిలాఫలకం ధ్వంసం
- ఇది అధికారపార్టీ శ్రేణుల పనేనని వైఎస్సార్‌సీపీ నాయకుల మండిపాటు



డి.కొట్టాలలో శిలాఫలకంపై ఉన్న నాటి ప్రజాప్రతినిధుల ఫొటోలు చెరిపేసిన దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని డి.కొట్టాల మెట్ట వద్ద వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు.అంతేకాదు అదే గ్రామంలోని మరో శిలాఫలకంపై ఉన్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చిత్రాలు కనిపించకుండా చెరిపేశారు. ఇది టీడీపీ నాయకుల పనేనని వైఎస్సార్‌సీపీ నాయకులు మండి పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. డి. కొట్టాల ఫ్యాక్షన్ గ్రామం. రెండు దశాబ్దాల క్రితం ఒకేసారి ఏడు హత్యలు జరిగాయి. ఆ సమయంలో కొందరు గ్రామం వదిలి పారి పోయారు. ఈ తర్వాత గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉంది. గ్రామస్తులు గొడవల జోలికి వెళ్లకుండా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కలిసికట్టుగా ఊరిని అభివృద్ధి చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గంగుల చాగలమర్రి మహాదేవపురం రోడ్డు నుంచి గ్రామంలోకి రూ.1.55 కోట్లతో తారు రోడ్డు, ఓ వంతెన నిర్మించారు. పనులకు సంబంధించి డి.కొట్టాల మెట్టపై ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని 2024 మార్చి7న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, నాడు ఎమ్మెల్యేగా ఉన్న గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించారు. ఓర్వలేక మంగళవారం గుర్తు తెలియని కొందరు ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంతో పాటు గ్రామంలో సీసీ రోడ్లకు సంబంధించిన శిలాఫలకాలపై ఉన్న నాటి ప్రజా ప్రతినిధుల చిత్రాలను గుర్తుపట్టని విధంగా రాళ్లతో గీకి చెరిపేశారు. ఉదయం వైఎస్సార్‌సీపీ నాయకులు గమనించి తీవ్ర నిరసన తెలిపారు. అధికారపార్టీకి చెందిన కొందరు ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అలజడి సృష్టిస్తున్నారని, శిలాఫలకాల ధ్వంసం కూడా వారిపనేనని ఆరోపిస్తున్నారు. పోలీసులు విచారణ జరిపి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. .

వరిలో మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



మాట్లాడుతున్న నంద్యాల ఏఓ ప్రసాదరావు



గోస్పాడు.. రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): వరిలో మోతాదుకు మించి ఎరువులను వాడరాదని, నత్రజని ఎరువులు మాత్రం మూడు దఫాలుగా వేసుకోవాలని నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మునగాల, రాయమాల్పురం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సమయానుకూలంగా కురుస్తున్న వర్షాలకు రైతులు వరిసాగులో పచ్చిరొట్ట ఎరువులు వేయాలన్నారు. దీని ద్వారా భూమిలో కర్బణశాతం పెరిగి నేల సారవంతం అవుతుందన్నారు. వరిగట్లపై కంది లేదా కూరగాయల సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే వరిసాగులో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వరిలో ఎస్‌డీఎల్ఆర్ సెవెన్, ఆర్ఎన్ఆర్ 15048 రకాలు ఖరీఫ్ సాగుకు అనుకూలమైనవని చెప్పారు. పురుగు మందులు విచక్షణా రహితంగా వాడకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

విత్తన శుద్ధితో పంటకు రక్ష

గోస్పాడు: విత్తన శుద్ధితో పంటలకు ఎంతో రక్షణ చేకూరుతుందని వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి అన్నారు. ఎం.చింతకుంట్ల, గోస్పాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేసుకునే పంటలకు విత్తన శుద్ధి చేసుకోవాలని చెప్పారు. మినుముకు మ్యాంగోజబ్ 2గ్రాములు ఒక కిలో విత్తనమునకు, ఇమిడా క్లోప్రిడ్ 5 గ్రాములు ఒక కిలో విత్తనమునకు, ట్రైకోడెర్మా విరిడి 10 గ్రాములు ఒక కిలో విత్తనానికి ఉపయోగించాలని సూచించారు. విత్తన శుద్ధి వల్ల నేల నుంచి పంటకు ఆశించే చీడపురుగులు, తెగుళ్లకు చెక్‌పెట్టవచ్చని రైతులకు తెలియజేశారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి



జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కిషన్ మోర్చా జిల్లా కమిటీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా జిల్లా కమిటీ అధ్యక్షులు రామకృష్ణరెడ్డి, తూముశివారెడ్డి కోరారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో చాలా మంది రైతులు పొగాకు సాగు చేశారన్నారు. అయితే, ఈ పంటను పొగాకు కంపెనీలు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. దిగుబడిని రైతులు ఇళ్లలోనే పెట్టుకున్నారని, వర్షాకాలంలో నిలువ చేసుకోవడం వారికి ఇబ్బందిగా మారిందన్నారు. పొగాకు బోర్డు ద్వారా సదరు నిల్వలను త్వరగా కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. అలాగే రైతుల దగ్గర మద్దతు ధరకు కొనుగోలు చేసిన జొన్నలకు సంబంధించిన డబ్బు ప్రభుత్వం ఇంకా విడుదల చేయలేదన్నారు. నాయకులు మండ్ల గంగాధర్, ప్రసాద్ రాజు, రామచంద్ర రెడ్డి, కొలకాని సాంబశివుడు,గోపాల్‌రెడ్డి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

నిందితుడిని శిక్షించాలి

నంద్యాల(అర్బన్): వధించడం కోసం గోవులను బంధించిన పొన్నాపురం కాలనీకి చెందిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు కోరారు. గోవులను బంధించిన కేసులో నిందితుడిపై పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ బయట పెట్టాలని కోరుతూ మంగళవారం నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులుకు సమితి నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ గోవుల తరలింపునకు సంబంధించి నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి 11 రోజులు అవుతున్నా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ధర్మరక్షాదళ్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌గౌడ్, నాయకులు రాంచరణ్, ప్రతాప్, నిఖిల్ సాయి, సతీష్, శివకుమార్, కల్యాణ్, శివ, తిదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని..

భార్యపై భర్త కత్తితో దాడి

ఉయ్యాలవాడ : మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తి భార్యపై కత్తితో దాడి చేశాడు. మంగళవారం మండలంలోని కొండుపల్లె గ్రామంలో ఈసంఘటన జరిగింది. ఇన్‌చార్జ్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు... గోన సుమిత్ర అకౌంట్‌లో తల్లికి వందనం పథకం డబ్బులు జమ అయ్యాయి. ఈ డబ్బులను మద్యం తాగేందుకు ఇవ్వాలని భర్త గోన వెంకట నరసింహుడు కోరాడు.ఇందుకు ఆమె నిరాకరించడంతో కోపోద్రిక్తుడైన నరసింహుడు ఎడమ చేతిపై మూడు చోట్ల కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఈమేరకు బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్పష్టం చేశారు.

చికిత్స పొందుతూ ..

శిరివెళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యర్రగుంట్లకు చెందిన కొల్లి అనూష (44)కోలుకోలేక మృతి చెందిందని ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు. ఈ నెల 15వ తేదీన తన అన్న లక్ష్మీరెడ్డితో కలిసి మోటార్ బైక్‌పై కామినేనిపల్లెలోని బంధువులను చూసి తిరిగి వస్తుండగా గోవిందపల్లె విమలా పాఠశాల వద్ద మరో బైక్ ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అనూషను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు వెళ్లగా కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. ఈమేరకు మృతురాలి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



అష్టాదళ పాదపద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, అరవేటి వాసు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 26వ తేదీ నుంచి ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ పైతాన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. కోర్స్ పూర్తి చేసిన వారికి గుర్తింపుతో కూడిన సర్టిఫికెట్ ఇస్తామని, శిక్షణ అనంతరం ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్: 8297812530 నంబరును సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న డీఎస్సీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 5 పరీక్ష కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు సజావుగా కొనసాగుతున్నట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లాలోని రాజీవ్‌గాంధీ, ఎస్‌వీఆర్, శాంతిరాం, శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగి పరీక్షకు 895 మందికి గాను 870 మంది హాజరయ్యారన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 895 మందికి గాను 851 మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈఓ తెలిపారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేద్దాం

నంద్యాల(అర్బన్): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సన్మాన సభ 19న హైదరాబాద్‌లో జరుగుతుందని, కార్యక్రమానికి దివ్యాంగులు వేలాదిగా తరలి రావాలని వీహెచ్‌పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌శెట్టి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మందకృష్ణమాదిగ దివ్యాంగుల పక్షాన పోరాడారని, ఆయన చేసిన మేలుకు కృతజ్ఞత చూపాల్సిన అవసరం ఉందన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు రామిరెడ్డి తనకు చెందిన పశువులను ఇంటికి తీసుకువెళ్తున్న సమయంలో సాయినాథరెడ్డి దారిలో బైకు అడ్డంగా పెట్టాడు. దీనిపై ప్రశ్నించిన రామిరెడ్డిని, అతని కుటుంబసభ్యులను సాయినాథరెడ్డి అసభ్య పదజాలంతో దూషించి దాడి చేసి గాయపరిచారు. ఆ తర్వాత రామిరెడ్డి కూడా అదే దారిలో మొద్దులు అడ్డుగా పెట్టాడు. ఎందుకు ఇలా అడ్డుపెట్టావని సాయినాథరెడ్డి ప్రశ్నించగా అతడిపై దాడి చేశారు. తర్వాత ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్పష్టం చేశారు.

తూతూ మంత్రంగా..



రైతులు రాకపోవడంతో మహిళలతో సమావేశమైన ఏఓ సుమతి

రుద్రవరం: పొలం పిలుస్తోంది కార్యక్రమం గ్రామాల్లో తూతూ మంత్రంగా సాగుతోంది. రైతుల నుంచి ఆశించిన మేర స్పందన లభించడం లేదు. ఖరీఫ్ సాగుపై నిర్వహిస్తున్న సమావేశాలకు వారు రావడం లేదు. మండలంలోని కె.కొత్తూరు, చిన్నయ్యస్వామి చెంచుగూడెంలో మంగళవారం వ్యవసాయాధికారి సుమతి, ఏఈఓ రాజు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నయ్యస్వామి చెంచుగూడెంలో నిర్వహించిన కార్యక్రమానికి రైతులెవ్వరూ రాకపోవడంతో స్థానిక మహిళలతో నిర్వహించారు. అధికారులు తూతూ మంత్రంగా రెండు మాటలు చెప్పి కార్యక్రమాన్ని ముగించారు.

విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

- ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలి
- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): 5 ఏళ్లు నిండిన పిల్లలు తప్పనిసరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డీఎల్ఏఎంసీ (జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 5 నుంచి 7 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాల మధ్యలో ఉన్న వారు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. జిల్లాలో ఆధార్ సెంటరు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అప్పుడే పుట్టిన నవజాత శిశువులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వెంటనే తాత్కాలిక జనన ధ్రువీకరణ పత్రం అందజేసేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. సమావేశంలో డీఎల్‌డీఓ శివారెడ్డి, జీడీబ్ల్యూఎస్ సమన్వయకర్త ఖాదర్, ఆధార్ రీజినల్ కార్యాలయ సిబ్బంది దామోదర్, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, డీఈఓ జనార్ధన్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలి

డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్ది వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి మెప్మా పీడీ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 221 యూనిట్ల నెలకొల్పాలన్నారు. నంద్యాల మున్సిపాలిటీలో 111, ఆళ్లగడ్డలో 24, ఆత్మకూరులో 19, బేతంచెర్లలో 17, డోన్‌లో 26, నందికొట్కూరులో 24 యూనిట్లను స్థాపించి మహిళల జీవనోపాధి, ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు అందించి ప్రోత్సహించాలన్నారు. అలాగే ఓఎన్‌డీసీ సైట్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలు విక్రయించే ఉత్పత్తులను పెద్ద ఎత్తున ప్రోత్సాహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్లు రుణాలు అందించేలా చూడాలన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు



డాక్టర్ శశికళారెడ్డి

బొమ్మలసత్రం: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని ఏపీఎస్ పీడీసీఎల్ మాజీ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గంలో కూలి పనిచేసుకునే మునికన్నప్ప స్థానిక టీడీపీ నాయకుడి వద్ద అప్పుతీసుకున్నాడన్నారు. అయితే సకాలంలో అప్పు తిరిగి చెల్లించలేదనే కారణంతో అతని భార్య శిరీషను చెట్టుకు కట్టి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఏదో ఓ చోట మహిళలపై ఇలా అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నా సర్కారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బాధితులకు అండగా నిలబడటంతో రాష్ట్ర హోంశాఖ మంత్రి విఫలమయ్యారన్నారు. శిరీష అనే బాధితురాలిని మంత్రి ఫోన్‌లో పరామర్శించి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శైలజ

ఆళ్లగడ్డ: వచ్చేనెల 5వ తేదీన జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామని సీనియర్ సివిల్ జడ్జి శైలజ అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి శైలజ మెగా లోక్ అదాలత్ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులకు పరిష్కారం జరిగేలా న్యాయవాదులు చొరవ తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులతోపాటు వాహన ప్రమాదం, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు వంటి వివిధ రకాల కేసులను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. దీనిపై ఇరువర్గాలకు చెందిన న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామిరెడ్డి, ఏజీపీ గుర్రెడ్డి, ఏపీపీ శివప్రసాద్ న్యాయవాదులు సూర్యనారాయణరెడ్డి, నీలంకంఠేశ్వరం, సుబ్బరామిరెడ్డి, రమణయ్య, సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు

యుద్ధంలో అమాయకులు బలి



యుద్ధాన్ని ఆపాలని ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని సీపీఐ, సీపీఎం న్యూడెమోక్రసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని పద్మావతినగర్ సెంటర్‌లో యుద్ధం వద్దు.. శాంతి ముద్దు.. ఇజ్రాయెల్ పాలస్తీనా, ఇరాన్‌లపై చేస్తున్న యుద్ధం దమనకాండను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని డిమాండ్ చేస్తూ ఆపార్టీల ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నాగరాజు, నరసింహ, బాబాఫక్రుద్దీన్, రాంబాబు మాట్లాడుతూ ఇజ్రాయెల్ పాలస్తీనాపై చేస్తున్న దాడులతో 55వేల మంది చనిపోయారన్నారు. అమెరికా అండతో ఈ దుశ్చర్యకు పాల్పడటం సరి కాదన్నారు. ఇరు దేశాల మధ్య సయోధ్యతో అభివృద్ధి జరుగుతుందని విధ్వంసం సృష్టిస్తే ఆ దేశాల మనుగడకే ప్రమాదమన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు చౌడప్ప, రాంబాబు, గౌస్, వెంకటలింగం, మౌలాలి, తోటమద్దులు తదితరులు పాల్గొన్నారు.

ఆథరైజేషన్ తప్పనిసరి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు

ఉయ్యాలవాడ : చౌక దుకాణ డీలర్లు ఆథరైజేషన్(లైసెన్స్) తప్పనిసరిగా కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చౌక దుకాణ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు చౌక దుకాణ డీలర్లు ఈ ఏడాది మే వరకు మాత్రమే లైసెన్స్‌లు కలిగి ఉన్నారని లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఉయ్యాలవాడ, కాకరవాడ, ఆర్.పాంపల్లె చౌక దుకాణ డీలర్లు జూన్ నెల రేషన్ కోట తక్కువగా వచ్చిందని డిప్యూటీ తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఆయన స్పందించి జూలై నెలలో 10 శాతం సరుకులను పెంచి ఇస్తామన్నారు. డీలర్లు సమయ పాలన పాటించి ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సరుకులు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ అంకన్న, ఏఎస్ఓ ఈశ్వరరావు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

బినామీ పేరుతో బిల్లు డ్రాపై విచారణ

నందికొట్కూరు: సచివాలయ భవనం బిల్లును బినామీ పేరుతో డ్రా చేసుకున్న ఘటనపై నంద్యాల డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు మంగళవారం విచారణ చేపట్టారు. మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో 2020-21లో కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు సచివాలయ భవనాన్ని నిర్మించాడు. బిల్లు కోసం పలుమార్లు అప్పటి పంచాయతీ సెక్రటరీ, ప్రస్తుత ఎమ్మెల్యే జయసూర్య పర్సనల్ సెక్రటరీ పి.రవీంద్రబాబు, మండల పంచాయతీరాజ్ ఏఈ విజయభాస్కర్ (క్వాలిటీ కంట్రోల్ ఏఈ కర్నూలు)ను కాంట్రాక్టర్ కలిసి విన్నవించుకున్నా బిల్లు చేయకుండా నిర్లక్ష్యం చేశారు. ఇదే విషయమై కాంట్రాక్టర్ గత ఏడాది సెప్టెంబర్ 14న ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.37 లక్షలను పీఎస్, ఏఈ ఇద్దరూ కలిసి బినామీ గొల్ల వెంకటేశ్వర్లు పేరుతో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతా నంబర్ 00000032556486158 నుంచి విడతల వారీగా డ్రా చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ బిజినవేముల గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. పీఎస్, ఏఈలకు పలుమార్లు ఫోన్ చేసినా వారు స్పందించకపోవడంతో మధ్యాహ్నం 2.30 గంటల వరకు వేచి చూశారు. మరో వైపు తనకు న్యాయం చేయాలంటూ డీఎల్‌పీఓ ఎదుట కాంట్రాక్టర్ కంటతడి పెట్టుకున్నారు. అనంతరం డీఎల్‌డీఓ విలేకరులతో మాట్లాడుతూ పీఎస్, ఏఈలకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదని, గ్రామస్తులను విచారించానని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.